# ఏడాదిలోగా గోదావరి జలాలు

- ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి మూడో స్థానమే
- రేవంత్ దోచిన సొమ్ముతో లీడర్లను కొంటున్నారు
- తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌కు రాష్ట్రమంతా లోకలే
- బీజేపోడు నాన్‌లోకల్... ఎల్లారెడ్డి నుంచి వచ్చి పోటీ చేస్తుండు
- కామారెడ్డిలో ఇంచు భూమి ఎక్కడికిపోదు
- భిక్కనూర్ రోడ్‌షోలో మంత్రి తారకరామారావు



రోడ్ షోకు హాజరైన అశేష జనవాహిని.. ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్

నిజామాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఏడాదిలోగా గోదావరి నీళ్లతో కామారెడ్డి నియోజకవర్గ ప్రజల కాళ్లు కడుగుతామని.. కామారెడ్డికి కేసీఆర్ వస్తున్నారంటే కలిసి వచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకు వచ్చినట్లు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కేసీఆర్ కోసం శనివారం ప్రచారం నిర్వహించేందుకు భిక్కనూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, ఎంపీ బీబీపాటిల్, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్ రెడ్డితో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో నిర్వహించి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

**ఏడాదిలోగా గోదావరి నీళ్లు...**

ఏడాదిలోనే గోదావరి నీళ్లతో భిక్కనూర్, కామారెడ్డి నియోజకవర్గ ప్రజల కాళ్లు కడుగుతామని కేటీఆర్ చెప్పారు. ప్రత్యేక ప్యాకేజీతో గల్ఫ్‌లో ఉంటున్న వారిని ఆదుకుంటామన్నారు. గల్ఫ్ బాధితులకు బీమాను ఇప్పటికే కేసీఆర్ ప్రకటించారని చెప్పారు. చిల్లర మాటలు నమ్మొద్దని సూచించారు. 70 ఏండ్ల వయసులో కామారెడ్డిలో పేద రైతు భూ మి గుంజుకునే ఆలోచన ఆయనకెందుకు ఉంటుందని స్పష్టం చేశారు. మీరు బాగుపడే ఆలోచన తప్ప కేసీఆర్‌కు ఎందుకు అలాంటి ఆలోచన ఉంటదని ప్రజలను అడిగారు. ప్రస్తుతం అత్తలకు పింఛన్ వస్తుందని, కోడళ్లకు కోపం ఉన్నదని కాకపోతే వారికి కూడా కేసీఆర్ శుభవార్త చెప్పారన్నారు. సౌభాగ్యలక్ష్మి పేరిట 18 ఏండ్లు నిండిన మహిళలకు నెలకు రూ. 3వేలు అందిస్తామని తెలిపారు. 16రాష్ట్రాల్లో బీడీలు చుట్టే వారున్నారని, వారికి బీడీ పింఛన్లు ఏ రాష్ట్రంలో ఇయ్యడం లేదన్నారు. కేసీఆర్ ఒక్కరే తెలంగాణ ఆడ బిడ్డల కోసం ఇస్తున్నారని చెప్పారు. కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నారని చెప్పారు. బీడీ కార్మికులకు కాంగ్రెస్ వాడు పింఛన్లు ఇచ్చిండా అని ప్రశ్నించారు. ఒంటరి మహిళలకు పింఛన్లు గతంలో ఉండెనా? అని ప్రశ్నించారు. కేసీఆర్ వచ్చినంకా పింఛన్ మొత్తం రూ.2016 అయ్యిందని తెలిపారు. బీడీ కార్మికులకు కటా ఫ్ పెంచాలని అంటున్నారని డిసెంబర్ 3 తర్వాత జనవరిలో కటాఫ్ పెంచి ప్రతి ఒక్కరికీ పింఛన్ ఇచ్చే బాధ్యత నాది అంటూ కేటీఆర్ చెప్పారు. మొన్నీ మధ్యే కాంగ్రెసోడు భిక్కనూర్‌కు భూములు గుంజుకునేందుకు కేసీఆర్ వస్తున్నాడు అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అడ్డం పొడు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలంతా ఆలోచించుకోవాలని సూచించారు. ఏదేదో మాట్లాడి.. పుకార్లు రేపుతున్నా రు. ఎకరం కాదు. గుంట కాదు. గజం కాదు. ఈంచు భూమి కూడా ఎవ్వరిదీ పోదు అంటూ కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాకతో ఇక్కడి ప్రజలకు ఉల్టా లాభం జరుగుతుందని చెప్పా రు. అసైన్డ్ భూములుంటే వారికి శుభవార్త అందుతుందన్నారు. డిసెంబర్ 3 తర్వాత అసైన్డ్ భూములున్న వారికి పట్టాలిచ్చి, హక్కులు కల్పిస్తామన్నారు.ఎన్నికల్లో ఎట్లాగో గెలిచేది కేసీఆరే అని... తప్పకుండా ప్రజలంతా గెలిపిస్తారని పేర్కొన్నారు.

**బీజేపోడే నాన్ లోకల్**

కామారెడ్డిలో కేసీఆర్‌ను నాన్ లోకల్ అంటున్న బీజేపీ అభ్యర్థే నాన్ లోకల్ అని కేటీఆర్ చెప్పారు. ఎల్లారెడ్డికి చెందినోడు తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను నాన్ లోకల్ అంటున్నారని... కేసీఆర్‌కు తెలంగాణ అంతటా లోకల్ అని చెప్పారు. కేసీఆర్ అమ్మగారిది ఇక్కడే కోనాపూర్ అని చెప్పుకొచ్చారు. సలాకాలు, సిమెంట్ ఇస్తానని చెప్పే వారికి బుద్ధి చెప్పాలన్నారు. కేసీఆర్ రాకతో కామారెడ్డి దశ మారుతుందన్నారు. అభివృద్ధి బ్రహ్మాండంగా జరుగుతుందని చెప్పారు. సీఎం వస్తే 5 ఏండ్లలో దేశంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా కామారెడ్డి నిలుస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అందుకే కామారెడ్డి నుంచి పోటీ చేయాలని కేసీఆర్‌ను పిలిచారన్నారు. సింగిల్ విండో చైర్మన్ నుంచి ప్రభుత్వ విప్ దాకా ఎదిగిన నాయకుడు గంప గోవర్ధన్ అని తెలిపారు. కేసీఆర్ కొత్త కార్యక్రమం తెస్తున్నారని, సౌభాగ్య లక్ష్మి ద్వారా మహిళలకు 3వేలు అందిస్తామన్నారు. వృద్ధులకు పింఛన్‌ను దశల వారీగా రూ.5వేలు చేయబోతున్నామన్నారు. 2014 సాధారణ ఎన్నికల్లో సిలిండర్ చూసి ఓటెయ్యాలని ప్రజలకు పిలుపునిచ్చిన మోదీ అదే సిలిండర్ ధరను రూ.1200 చేశారని మండి పడ్డారు. మూడో సారి అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.400కే సిలిండర్ అందిస్తుందన్నారు. మిగిలిన 800 భారాన్ని కేసీఆరే భరిస్తారని చెప్పారు.



## రేవంత్‌కు మూడో స్థానమే...

జనవరిలో కొత్త రేషన్ కార్డులు వస్తాయని కేటీఆర్ ప్రకటించారు. తెల్ల రేషన్ కార్డుదారులకు అన్నపూర్ణ పథకం కింద సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. రైతుబీమా మాదిరిగా కేసీఆర్ బీమా... పథకం ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు భూమి ఉన్నా లేకున్నా రూ.5లక్షల జీవిత బీమా అందించబోతున్నట్లు చెప్పారు. రేవంత్ రెడ్డి... భిక్కనూర్‌కు వచ్చి కేసీఆర్‌ను పట్టుకుని బూతులు తిట్టుడు... నోటికొచ్చినట్లు ఒర్రుడు తప్ప ఏమీ లేదన్నారు. కొడంగల్‌లో 2018లో ఓడగొడితే ఈడికి వచ్చినోడు... ఏదేదో మాట్లాడుతున్నారని తెలిపారు. కొడంగల్‌లో చెల్లని రూపాయి కామారెడ్డిలో చెల్లుతుందా అని ప్రశ్నించారు. రేవంత్‌కు మూడో స్థానం తథ్యమన్నారు. సర్పంచులు, జడ్పీటీసీలను కొంటే ఓటర్ల మనసులను కొనలేరన్నారు. బిడ్డా యాదికిపెట్టుకో... ఉద్యమానికి పురుడు పోసిన గడ్డ... ఏకగ్రీవాలతో బీఆర్ఎస్‌కు పురుడు పోసిన గడ్డ కామారెడ్డి అని చెప్పారు. ఇద్దరు ముగ్గురిని కొన్నా ఆగం కావొద్దని, డిసెంబర్ 3న ఉద్యమ దెబ్బ చూపిస్తామన్నారు. ఎవరు ఎన్ని చెవులు కొరికినా ఏమీ కాదన్నారు. అంతా బోగస్ ముచ్చటను కాంగ్రెస్ మోస్తున్నదన్నారు. ఒక్క ఛాన్స్ అంటున్న కాంగ్రెస్ కు 11 చాన్సులు ఇచ్చామన్నారు. మల్లా ఆ దరిద్రం రావాల్నా అంటూ ప్రజలను ప్రశ్నించగా.. వద్దంటూ బదులిచ్చారు.

## రాహుల్, మోదీ ప్లాన్ ఒక్కటే

లీడర్లను కొనొచ్చు కానీ ప్రజలను కొనలేరని... సింహం ఎప్పుడు సింగిల్‌గానే వస్తుందని కేటీఆర్ చెప్పారు. కామారెడ్డికి మంచి రోజులు వస్తాయన్నారు. రేపటి రోజున గల్లా ఎగిరేసే విధంగా ఈ ప్రాంత ప్రజలు ఉంటారన్నారు. గజ్వేల్ వారు మంత్రుల వద్దకు వస్తే వణుకుకుంటా పనిచేస్తామని భవిష్యత్తులో కామారెడ్డి ప్రజలకు ఇదే మహర్దశ దక్కుతుందన్నారు. ఏ పని అడిగినా చేసుడేనని చెప్పారు. బ్రహ్మాండంగా అభివృద్ధి చేసే బాధ్యత నాది. గెలిచిన తర్వాత కేసీఆర్, గంప గోవర్ధన్ కలిసి బాధ్యత తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులుంటే కేసీఆర్‌తో కలిపించే బాధ్యత తనదే అన్నారు. అమ్ముడు పోయినోళ్ల సంగతి ఎలక్షన్ల తరవాత చూసుకుందామన్నారు. ప్రజలు మనతోనే ఉన్నారు. మోదీ, యోగి, బోగి, 15 మంది కేంద్ర మంత్రులు, బీజేపీ అధ్యక్షులు, రాహుల్, డీకే ఇంత మంది వస్తున్నారంటే వాళ్ల భయం ఒక్కటేనన్నారు. మూడో సారి గెలిస్తే ఢిల్లీ వస్తాడు. జెండా పాతుతాడు అని భయం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు పట్టుకుందన్నారు. రోడ్ షోలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, ఎంపీ బీబీపాటిల్, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ చిత్రంలో ప్రభుత్వ గంప గోవర్ధన్



మంత్రి కేటీఆర్‌కు చూసి ఆనంద పడుతున్న మహిళలు



కేటీఆర్‌ను చూసేందుకు తరలివచ్చిన మహిళలు



రోడ్డుపై స్థలం లేకపోవడంతో బిల్డింగ్‌పైకి ఎక్కి కేటీఆర్ ప్రసంగాన్ని వింటున్న ప్రజలు